# కోకాపేట్ భూములను ఏం చేద్దాం?

- మిగులు 24 ఎకరాలపై తర్జన భర్జన?
- భూముల వేలంపై హెచ్ఎండీఏ మల్లగుల్లాలు
- మార్కెట్ తిరోగమనంతో వీడని సందిగ్ధం
- గాడి తప్పిన మార్కెట్
- స్థిరత్వం సాధ్యం కాదని స్పష్టం

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): మార్కెట్ బాలేదు. కొనుగోళ్లు జరగడం లేదు. భవన నిర్మాణ అనుమతుల్లో కదలిక లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త ప్రాజెక్టులు చేపట్టడం అవసరమా? అంటూ కాసులు కురిపించే భూముల వేలంపై హెచ్ఎండీఏ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎకరం రూ.వంద కోట్లకు అమ్ముడైన కాలం నుంచి, రేట్లు తగ్గించి ప్లాట్లను విక్రయిస్తామని చెప్పినా కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల నడుమ విలువైన భూములను వేలం వేసినా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా అంతంత మాత్రమేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. బిల్డింగుల నిర్మాణం నుంచి కొత్త లే అవుట్ల అనుమతుల వరకు పర్మిషన్లు రావడమే గగనమైంది. ఇటీవల కాలంలో హెచ్ఎండీఏలో జరుగుతున్న జాప్యాన్ని నివారించే అనుమతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడింది. అనుమతులను పది రోజుల్లో ఇచ్చేందుకు ఉన్నతాధికారులు చొరవతీసుకున్నా..., పడుకున్న మార్కెట్ పరుగులు పెట్ట లేకపోతుంది. ఇలాంటి సమయంలో భూముల వేలం పాట అంటే... అన్ సీజన్‌లో అమ్మకాలు జరుపుకున్నట్లుగా ఉంటుందనీ హెచ్ఎండీఏ అధికారులు భావిస్తున్నారు.




### కోకాపేట్ భూముల్లో చకచకా అభివృద్ధి పనులు

కోట్లు కురిపించిన కోకాపేట్ భూముల్లో మిగిలిన 24 ఎకరాల డెవలప్‌మెంట్ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్లాట్లను డెవలప్ చేస్తూనే మార్కెట్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం యోచిస్తోంది. కానీ, అందుకు భిన్నమైన పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఉండటంతో కోకాపేట్ భూముల వేలంపై అధికారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకువచ్చే నియోపొలిస్ వెంచర్ ద్వారా అంచనాల మేర ఆదాయం వచ్చే పరిస్థితి లేదని భావిస్తున్నారు. దీంతో పాటు నగరంలో పలు చోట్ల కూడా భూముల వేలానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నా.. హైడ్రా, మూసీ కూల్చివేతలు ఇచ్చిన షాక్ నుంచి కొనుగోలుదారులు ఇంకా కోలుకోలేదు. ఇలాంటి తరుణంలో వేలం నిర్వహించి ప్రాజెక్టును నీరుగార్చినట్లే అవుతుందని హెచ్ఎండీఏ వర్గాలు భావిస్తున్నాయి.

### మార్కెట్ లేకుంటే వేలం అసాధ్యమే..!

నిజానికి రాష్ట్రంలో భూముల వేలం కొత్తేమీ కాదు. గత ప్రభుత్వం కూడా భూముల పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వేలం నిర్వహించి, నిధులను సమకూర్చుకుంది. కానీ, వేలానికి ముందు రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన నిర్ణయాలు, అందుకు అవసరమైన మౌలిక వసతులు, పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఆయా భూములకు విపరీతమైన డిమాండ్‌ను తీసుకువచ్చింది. అదే విధంగా కొనుగోలుదారులకు అనువైన వాతావరణం కల్పించింది. కానీ, గడిచిన ఏడాది కాలంగా నగరంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గతంలో హైదరాబాద్ శివారులో ఏర్పడిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్లను కొనేందుకు ఆసక్తి చూపే జనాలు కూడా కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన ఇబ్బందులతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విలువైన భూములకు వేలంతో అమ్మకాలు అసాధ్యమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ తేరుకునేంత వరకు భూముల వేలం చేయడం లేదా.. రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రభుత్వమే చొరవ తీసుకుంటే తప్పా... గాడి తప్పిన మార్కెట్ స్థిరత్వం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దాన కిశోర్, చిత్రంలో పలు విభాగాల అధికారులు

## భూగర్భ సంపుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- అధికారులకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఆదేశం
- 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల నిర్మాణం
- నాలుగు చోట్ల పూర్తయ్యాయి: అధికారుల వివరణ

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జోన్ రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్‌హౌజ్ ప్రవేశ మార్గంలో భూగర్భ సంపు (రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనుల పురోగతిని దాన కిశోర్ క్షేత్రస్థాయిలో జీహెచ్ఎంసీ, జల మండలి, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న భూగర్భ సంపు పనులను పర్యవేక్షించారు. గ్రేటర్‌లో 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపట్టామని, వీటిలో నాలుగు చోట్ల పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఇతర పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా రోడ్లపై నీరు నిల్వకుండా చూడటం, ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు నిర్మిస్తున్న భూగర్భ సంపులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను దాన కిశోర్ ఆదేశించారు.

### ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా ముస్తాబు చేయాలి

ప్రజాపాలన-ప్రజా విజయోత్సవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 7,8,9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, పీవీ మార్గ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని దాన కిశోర్ ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ వేడుకల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆత్మగౌరవానికి దెబ్బ.. దుర్మార్గం


అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగుల జేఏసీ సభ్యులు

బంజారాహిల్స్, నవంబర్ 23: లక్షలాది మంది పేదలు ఉన్నత విద్యను అభ్యసించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని ఉద్యోగులు, అధ్యాపకులు 65 రోజులుగా ఆందోళన నిర్వహిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలోని 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన కొనసాగుతున్నది. కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో జేఏసీ నేతలు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలు, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఎంతోమంది అంబేద్కర్ వర్సిటీ నుంచి ఉన్నత విద్యను పొంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని, రానున్న రోజుల్లో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టి లక్షలాది మందికి ఉన్నత విద్యను అందించాల్సిన తరుణంలో స్థలాన్ని వేరే సంస్థకు కేటాయించడమంటే ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమే అని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 27న 'వంటా వార్పు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు డా. యాకేశ్ దైద, డా. ఉదయిని, కాంతం ప్రేమ్ కుమార్, డా.రాఘవేంద్ర, షబ్బీర్, పాండు, రాములు, డా. అంబేద్కర్ పాల్గొన్నారు.

## సైబర్ దోపిడీ నుంచి వృద్ధ దంపతులకు రక్షణ

- రూ.46 లక్షల మోసాన్ని అరికట్టిన అధికారులు
- ఆరా తీసి ధైర్యం చెప్పిన చాంద్రాయణగుట్ట ఎస్‌బీఐ బ్రాంచ్

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): సైబర్ నేరస్తులు వృద్ధ దంపతులను టార్గెట్ చేశారు. వారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని వేధించగా వారు ఎస్‌బీఐ బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారికి ధైర్యం చెప్పి సైబర్ దోపిడీ జరుగకుండా అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే నగరానికి చెందిన ఇద్దరు వయోవృద్ధులు రూ.46 లక్షల చెక్కును తీసుకొని డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసేందుకు చాంద్రాయణగుట్ట ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వచ్చారు. భయాందోళనలో వణికిపోతున్న ఆ దంపతులను పరిశీలించిన బ్యాంకు సీనియర్ అసోసియేట్ బి.ప్రవీణ్ వారికి ధైర్యం చెప్పి ఏజీఎం డాక్టర్ శివ కుమార్ వద్దకు తీసుకెళ్లారు. ఏం జరిగిందని.. ఆరా తీయగా, మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు తాము సీబీఐ అధికారులమని సునీల్ గ్రోవర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని, అతను వంద కోట్ల స్కామ్‌కు పాల్పడ్డాడని, అతని బ్యాంకు కేవైసీ, ఆధార్ ఇతర పత్రాలు మీ పేరిట ఉన్నాయని బ్లాక్ మెయిల్‌కు దిగారు. మ్యాటర్‌ను సెటిల్ చేసుకోవాలని, అందుకు రూ.46 లక్షలు తమకు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేయాలని, లేని పక్షంలో వారితో పాటు వారి కొడుకును కూడా అరెస్టు చేస్తామని బెదిరించారు. మూడు రోజులుగా పదే పదే వీడియోకాల్ చేస్తూ ఆ దంపతులను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బుల కోసం ఒత్తిడి చేశారు. వారి వేధింపులు భరించలేక ఆ వృద్ధ దంపతులు బ్యాంకుకు వెళ్లి సైబర్ నేరగాళ్లు సూచించిన అకౌంట్‌లో డబ్బులు వేసేందుకు చెక్కుతో వచ్చారు. అప్పటికే వణికిపోతూ భయపడుతూ ఉన్న ఆ దంపతులకు ధైర్యం చెప్పి ఆరా తీయగా, అసలు విషయం బయటపడింది. దీంతో బ్యాంకు అధికారులు అది సైబర్ మోసమని, ఇలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించి వారికి సాంత్వన కలిగించారు. సైబర్ మోసం నుంచి కాపాడిన బ్యాంకు అధికారులను వారు అభినందించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు బ్లాక్ మెయిల్‌కు పాల్పడి డబ్బులు చెల్లించాలని కోరితే వెంటనే సైబర్ క్రైమ్ నం. 1930ను సంప్రదించాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు.






## జంక్షన్లు అందంగా..

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): సుందరీకరణలో భాగంగా జంక్షన్లు, ఫ్లై ఓవర్లు, పార్కులు వివిధ రకాల సుందరీకరణ పనులను జీహెచ్ఎంసీ చేపడుతున్నది. ఆరు జోన్ల పరిధిలో రూ.149.84 కోట్ల అంచనా వ్యయంతో 224 సుందరీకరణ పనులు చేపట్టగా, అందులో రూ.5.33 కోట్ల విలువ గల 15 పనులు పూర్తయ్యాయి. కాగా, మిగతా 209 పనులు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. చిన్నారులకు, యువతకు స్ఫూర్తినిచ్చేలా సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఈ జంక్షన్లలో పాదచారుల భద్రతతో పాటుగా సుందరీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రధానంగా భావి తరాలను ప్రభావితం చేసే విధంగా కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఫ్లై ఓవర్లు, కొన్ని చోట్ల ఉద్యానవన పెయింట్స్, వెరైటీ థీమ్స్‌తో కళాత్మక చిత్రాలు వేశారు. సెంట్రల్ మీడియం జంక్షన్లలో శిల్పాలు, ఆకర్షించే ప్రత్యేక థీమ్‌లతో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.



**బాలోత్సవ్..** బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బాలోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చిన్నారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు చేసి అలరించారు.





## బీసీల స్థితిగతులపై అర్జీల స్వీకరణ

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతుల అధ్యయనంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ శనివారం జరిగింది. కుల సంఘాలు, కుల వృత్తుల వారి నుంచి అర్జీలు తీసుకున్నామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి తొమ్మిది జిల్లాలలోని బీసీల స్థితిగతులపై కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందన్నారు. ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లివర్ రక్షణకు ఆధునిక సదుపాయాలు అవసరం


నానక్‌రాంగూడ స్టార్ హాస్పటల్‌లో లివర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ చలనచిత్ర దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి, ఇతర వైద్య ప్రముఖులు

శేరిలింగంపల్లి, నవంబర్ 23: లివర్ సంరక్షణకు అత్యాధునిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఏంతైనా ఉందని, ఈ దిశగా స్టార్ లివర్ ఇనిస్టిట్యూట్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ప్రముఖ చలనచిత్ర దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని స్టార్ హాస్పటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ లివర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజమౌళి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి వసతులతో రోగులకు మెరుగైన సేవలందించేందుకు వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ఈ తరహా ఇనిస్టిట్యూట్ సేవలు కీలకమన్నారు. స్టార్ హాస్పటల్ ఏండీ గోపీచంద్ మన్నం, జాయింట్ డైరక్టర్ రమేష్ గుడపాటి, ప్రముఖ లివర్ వైద్య ప్రముఖులు రవీంద్రనాథ్, మెట్టు శ్రీనివాస్ రెడ్డిలతో పాటు పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన బహిష్కరణ

### మేడ్చల్ జిల్లాలో ప్రదర్శనకు దూరంగా ఉపాధ్యాయ సంఘాలు


జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 23: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గాగిల్లాపూర్ ఎన్ఎస్‌కేకే పాఠశాలలో ఈ నెల 22, 23వ తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను పలు ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించారు. ఈ సందర్భంగా టీపీయూఎస్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీయూటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం విద్యాశాఖ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తారని, ఈ సంవత్సరం కేవలం తూతూ మంత్రంగా ఈ ప్రదర్శన నిర్వహించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాలకు సమాచారం లేదని, జిల్లా అధికారులు ఒంటెద్దు పోకడలను ఖండిస్తున్నామని అన్నారు. అందుకు నిరసనగా ఉపాధ్యాయ సంఘాలన్ని ఈ కార్యక్రమాన్ని బహిష్కరించామని తెలిపారు. ఇక ముందు ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శ్రీధర్, గడప నవీన్, వెంకటేశ్వర్లు, జయసింహా రెడ్డి, మదన్ రెడ్డి, విట్టల్, బ్రహ్మాచారి, రాఘవేందర్ పాల్గొన్నారు.

## విజయగాథ, నిశ్శబ్ద తరంగిణి పుస్తకాల ఆవిష్కరణ


విజయగాథ, నిశ్శబ్ద తరంగిణి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఉమ్మడి ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు తదితరులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 23: డాక్టర్ బోయి విజయ భారతి స్వీయ చరిత్ర ఆధారంగా విజయ గాథ, నిశ్శబ్ద విప్లవ తరంగిణి స్మారక సంచిక పుస్తకాల ఆవిష్కరణకు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం శనివారం సాయంత్రం వేదిక అయ్యింది. బొజ్జా తారకం ట్రస్ట్, బోయి విజయభారతి స్మారక సంచిక కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకాల ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు విజయ గాథ (డాక్టర్ బోయి విజయ భారతి స్వీయ చరిత్ర) పుస్తకాన్ని, ఉస్మానియా విశ్వ విద్యాలయం రాజనీతి శాస్త్ర శాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ రమా మేల్కొటే, నిశ్శబ్ద విప్లవ తరంగిణి (డాక్టర్ బోయి విజయ భారతి స్మారక సంచిక) పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర మానవ హ క్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, ప్రముఖ పత్రికా సంపాదకులు సతీశ్ చందర్, అవయవదాన ప్రచారకులు, సామాజిక ఉద్యమకారిణి గుత్తా జ్యోత్స్న, హైదరాబాద్ కేంద్ర విశ్వ విద్యాలయం ఉమెన్ స్టడీస్ సెంటర్ డాక్టర్ సునీతా రాణి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్, బొజ్జా తారకం ట్రస్ట్ - మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగర్ కర్నూలు డాక్టర్ మహిత బొజ్జా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం చైర్మన్ డాక్టర్ కె. లింగయ్య, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.సుధారాణి, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు, మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల జేఏసీ కె.సజయ, దళిత స్త్రీ శక్తి గడ్డం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజంలో తూటుపల్లి రవికి డాక్టరేట్



సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన తూటుపల్లి రవి కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ పి.యల్.విశ్వేశ్వర్ రావు పర్యవేక్షణలో 'బాలల హక్కులు మీడియా కవరేజీ' అనే అంశంపై రవి కుమార్ పరిశోధన చేశారు. నేటి సమాజంలో మీడియా పాత్ర కీలకమైనదని, భవిష్యత్ తరానికి నిర్మాతలైన చిన్న పిల్లలకు మీడియా ఇస్తున్న ప్రాధాన్యతపై పరిశోధన జరిగిందని రవి కుమార్ తెలిపారు. సమాజంలో చిన్న పిల్లలపై రోజురోజుకూ జరుగుతున్న అకృత్యాలు, ప్రభుత్వాలు వారికి వివిధ రంగాల్లో ఇస్తున్న ప్రాధాన్యతపై సవివరంగా పరిశోధన జరిగినట్లు ఆయన తెలియజేశారు.